ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ

మేడ్చల్: ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లిలో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి కాంగ్రెస్ నేతలతో కలిసి మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. మాజీ కౌన్సిలర్ సరితాగౌడ్, కాంగ్రెస్ నాయకుడు మల్లేష్‌గౌడ్‌లతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మహిళలకు 100 రోజుల ప్రణాళికపై అవగాహన కల్పించారు. మున్సిపల్ ఏఈ జ్ఞానేశ్వర్‌రెడ్డి, సిబ్బంది రజియా, శ్రీనివాస్, కిరణ్, తదితరులున్నారు.

రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలి

శామీర్‌పేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని శామీర్‌పేట్, మూడు చింతలపల్లి మండలం తహసీల్దార్లు యాదగిరిరెడ్డి, వెంకటనరసింహారెడ్డిలు అన్నారు. మంగళవారం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతు రెవెన్యూ సదస్సులకు అపూర్వ స్పందన లభించింది. శామీర్‌పేట మండలంలో పోతాయిపల్లిలో 8, యాడారంలో 27 అర్జీలు మొత్తం 35 వచ్చాయని, శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి తెలిపారు. మూడుచింతలపల్లి రైతువేదికలో నాగిశెట్టిపల్లి గ్రామపంచాయతీల వద్ద నిర్వహించారు. మూడుచింతలపల్లిలో రైతువేదికలో రైతుల నుంచి 37 అర్జీలు, నాగిశెట్టిపల్లిలో 6, చిన్నపర్వతాపూర్ రెవెన్యూలో 6 అర్జీలు మొత్తం 49 ఫిర్యాదులు వచ్చాయని తహసీల్దార్ వెంకటనరసింహారెడ్డి తెలిపారు. మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహయాదవ్, డిప్యూటీ తహసీల్దార్లు సంయుక్త, అనూష, ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్లు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కీసరలో 'నాణ్యమైన విత్తనం- రైతన్నకు నేస్తం'

కీసర: కీసరలోని రైతువేదికలో 'నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతి గ్రామంలో క్వాలిటీ సీడ్ కింద కీసర మండలంలోని ప్రతి గ్రామంలో ముగ్గురు రైతులను ఎంపిక చేసి వారికి నాణ్యమైన మూల విత్తనం పంపిణీ చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్త శివాణి, ఏడీఏ వెంకటరాంరెడ్డి, కీసర మండల వ్యవసాయశాఖ అధికారిణి మాధవీలత, ఏవో కృష్ణవేణి, ఏఈవో వందన, రాజ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వేణుగోపాల్, కీసర మండల రైతులు పాల్గొన్నారు.

మహిళపై దాడి చేసిన వారిపై కేసు

పోచారం: ఓ మహిళపై దాడిచేసిన ఇద్దరు వ్యక్తులపై పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఇస్మాయిల్‌ఖాన్‌గూడలోని శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన పినగాని రాధిక (30) మే 6 న తన ఇంటి ముందు టీ తాగుతుండగా.. అక్కడే ఉన్న ఉమారాణి తన కుమార్తె అమూల్యతో కలిసి రాధికను అసభ్యకరమైన పదజాలంతో తిట్టారు. ఎందుకు తిడుతున్నారని రాధిక అత్త పినగాని జ్యోతి ప్రశ్నించింది. దీంతో ఆమెపై దాడి చేసి బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం. గ్రామపెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టినప్పటికీ ప్రయోజనం లేకుండాపోయింది. దీంతో బాధితురాలు మే 23న కోర్టును ఆశ్రయించడంతో నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలిక అదృశ్యం

పోచారం: బాలిక అదృశ్యమైన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నోజిగూడలోని గాయత్రి ఆలయం వద్ద ఉన్న బంధువుల ఇంటికి సదరు బాలిక (17) సోమవారం వచ్చింది. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో బంధువులు నిద్రలేచి చూస్తే ఆమె ఇంకా నిద్రలోనే ఉంది. అదే రోజు 7 గంటల సమయంలో తిరిగి చూడగా.. కనిపించలేదు. ఆచూకీ కోసం వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనాథాశ్రమం నుంచి యువతి..


మేరీ

పోచారం: అనాథాశ్రమం నుంచి ఓ యువతి అదృశ్యమైన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. యానంపేట్‌లోని నవదుర్గాకాలనీలో ఉన్న ఎటర్నల్ జాయ్ అనాథాశ్రమంలో మేరీ (24) గత పదేళ్లుగా ఉంటోంది. ఈమె బధిరీ కాగా.. సైగలతో ఏదైనా చెప్పగలదు. సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా లభించకపోవడంతో మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో అనాథాశ్రమం ఇన్‌చార్జి నాగమణి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త !

● తక్కువ ధర ఆశతో మోసపోతున్న అన్నదాతలు ● జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్న అధికారులు

ఘట్‌కేసర్: విత్తనం మంచిదైతే అన్నదాతలు ఆశించిన పంట దిగుబడి వస్తుంది. ప్రతి సీజన్‌లో ఎక్కడో ఓచోట రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోతుంటారు. విత్తనాల ధరల ఆశ చూపి అన్నదాతను ముంచుతుంటారు. ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని ఘట్‌కేసర్ మండల వ్యవసాయాధికారి లావణ్య తెలిపారు. ఈ నేపథ్యంలో వర్షాకాలంలో కొనుగోళ్లపై అన్నదాతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం...


ఘట్‌కేసర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారి

వర్షాకాలం సీజన్ ప్రారంభం..

వర్షాకాలం పంటలకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేస్తున్నారు. అదునుచూసి కొందరు మోసగాళ్లు ఈ సమయంలో అన్నదాతలకు నకిలీ విత్తనాలు, ఇతర మందులు అంటగడతారు. ఈ సమయంలో అన్నదాతలు అప్రమత్తంగా లేకపోతే సాగు పెట్టుబడి బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. ఏదైనా అనుమానం వస్తే తక్షణమే వవ్యవసాయశాఖ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలి. గతంలో అలియాబాద్‌లో తనిఖీలు చేపట్టి పెద్దఎత్తున నకిలీ విత్తనాలను అధికారులు సీజ్ చేశారు.

అనుమానం ఉంటే సమాచారం ఇవ్వాలి..

నకిలీవని అనుమానం ఉంటే వ్యవసాయశాఖ అధికారులకు సమాచారమిస్తే విచారించి క్రిమినల్ కేసు నమోదు చేస్తారు. సంచులపై క్యూఆర్ కోడ్ ఉంటుంది. మొబైల్ స్కానర్ ద్వారా స్కాన్ చేసి విత్తనాల వివరాలు చూసుకోవాలి.

అసలు విత్తనాలను తలదన్నేలా..

సాధారణంగా గ్రామాల్లో నకిలీ విత్తనాలు గుడ్డ సంచుల్లో విడిగా రాత్రి సమయాల్లో విక్రయిస్తుంటారు. విత్తనాల ప్యాకింగ్ నిజమైన ప్యాకింగ్‌లా ముద్రిస్తారు. వీటిపై తయారు, గడువు తేదీ, మొలకశాతం, చిరునామా ఉండవు. ఇలాంటి వాటిని తక్కువ ధరల్లో అమ్ముతుంటారు. ప్యాకెట్లు చూస్తే మార్కెట్‌లో లభించే వాటిగానే కనిపిస్తుంటాయి. కానీ పేరులో ఏదో ఒక అక్షరం తేడా ఉంటుంది.

ప్రతి కొనుగోలుకు బిల్లు తీసుకోవాలి...

లైసెన్స్ కలిగి ఉన్న దుకాణాల్లోనే విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలి. విత్తన సంచులు, ప్యాకెట్లు ముందే విప్పినట్లు అనిపిస్తే తీసుకోకూడదు. సంచులపై లాట్ నెంబర్, డేట్ ఆఫ్ ప్యాకింగ్, లేబుల్, డీలర్ బిల్లుపై తేదీ, సంతకంతో కూడిన బిల్లు తప్పనిసరి తీసుకోవాలి. విత్తనాల బస్తాకు ఉండే ట్యాగ్, లోగో, కంపెనీ పేరు చూసుకోవాలి. పంట చేతికి వచ్చే వరకు వాటిని భద్రపరచాలి. అధికారిక డీలర్లు, వ్యవసాయశాఖ మార్కెట్ కమిటీలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోనే ఎరువులు కొనుగోలు చేయాలి.

నకిలీలతో మోసపోవద్దు...



నకిలీ విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లపై రైతులకు అవగాహన కల్పించాం. విత్తనాలు, క్రిమిసంహారక మందులు విక్రయించే దుకాణాలను తనిఖీ చేశాం. అధికారిక దుకాణాల్లోనే రైతులు కొనుగోలు చేయాలి. ప్రతి కొనుగోలుకు బిల్లు తీసుకోవాలి. నకిలీలపై అనుమానం వస్తే మా దృష్టికి తీసుకురావాలి. వారిపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– లావణ్య, వ్యవసాయాధికారి ఘట్‌కేసర్

భూ సమస్యలు పరిష్కరించేందుకే రైతు సదస్సులు

అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి


ఘట్‌కేసర్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: రైతుల ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కరించడానికే రైతు సదస్సులు ప్రభుత్వం నిర్వహిస్తోందని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. ఏదులాబాద్, ఘట్‌కేసర్‌లో మంగళవారం ప్రారంభించిన రైతుసదస్సులో టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్, జెడ్పీ మాజీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి ఏదులాబాద్‌లో 138, ఘట్‌కేసర్‌లో 45 దరఖాస్తులు స్వీకరించి పరిశీలించారు. అనంతరం రైతుల సందేహాలకు సమాధానాలిచ్చారు. రైతులు ఇచ్చిన దరఖాస్తులను పరిష్కరిస్తామన్నారు. తహసీల్దార్ రజిని, నాయబ్ తహసీల్దార్ రాజేందర్, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, మాజీ చైర్‌పర్సన్ పావనీ జంగయ్య, మాజీ వైస్ ఎంపీపీ జంగమ్మ, కుమార్‌గౌడ్, జంగయ్యయాదవ్, అన్నదాతలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలపై మంత్రికి ఎమ్మెల్యే వినతి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబును మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కలిశారు. ఎమ్మెల్యే బీఆర్ఎస్ నేతలతో కలిసి సెక్రటేరియట్‌లోని మంత్రి కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రతాపసింగారంలో అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని కోరారు. అర్హులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. బోడుప్పల్ పరిధిలోని సర్వే నంబర్ 63/2, 63/25లలో దళితుల ల్యాండ్ పూలింగ్ నిలిచిపోయిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యం


ఏదులాబాద్‌లో విత్తనాలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త రాధిక, లావణ్య, చైర్మన్ రాంరెడ్డి

ఘట్‌కేసర్: ప్రతి గ్రామంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం తక్కువ ధరకు విత్తనాలు అందజేస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్త రాధిక అన్నారు. ఏదులాబాద్ రైతువేదికలో ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం' లో భాగంగా గ్రామానికి ముగ్గురు రైతులకు 10 కిలోల చొప్పున ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డితో కలిసి విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నాణ్యమైన విత్తనాలతో 10–15 శాతం దిగుబడిని పెంచడమే లక్ష్యమన్నారు. ప్రభుత్వం అందజేసిన వంగడాలతో అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఏడీఏ వెంకట్‌రాంరెడ్డి, మండల వ్యవసాయాధికారి లావణ్య, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్లు ఉదయ్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్, మాజీ డైరెక్టర్ అంజిరెడ్డి, అన్నదాతలు పాల్గొన్నారు.


పూడూర్ రైతువేదికలో విత్తనాలు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రైతులకు విత్తనాల పంపిణీ

మేడ్చల్: ప్రతి గ్రామంలో ఎంపిక చేసిన రైతులకు 10 కిలోల చొప్పున వ్యవసాయశాఖ ఉచితంగా అందజేస్తున్న వరి విత్తనాలను మంగళవారం అధికారులు, కాంగ్రెస్ నేతలు అందజేశారు. రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం తరుపున ఎంటీయూ 1010 వరి విత్తనాలను వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి పంపిణీ చేశారు. పూడూర్, రాయిలాపూర్ రైతు వేదికల్లో సమావేశం నిర్వహించి రైతులకు అందజేశారు. విత్తనాలు పొందిన రైతులు నూతన రకంతో పంట సాగుచేసి విత్తనోత్పత్తి చేస్తారని తెలిపారు. సమావేశాల్లో శాస్త్రవేత్తలు లావణ్య, ఏఈ అర్చన, డబీల్‌పూర్ పీఏసీఎస్ చైర్మన్లు సురేష్‌రెడ్డి, రణదీప్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు రమణారెడ్డి, సంజీవరావు, మురళీగౌడ్, వెంకటేష్‌యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు, ఏఈఓలు సుమిత, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గావాహిని శౌర్య ప్రశిక్షణ ర్యాలీ


ఘట్‌కేసర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో దుర్గావాహిని ప్రాంత శౌర్య ప్రశిక్షణ ర్యాలీ మంగళవారం ఘనంగా నిర్వహించారు. అన్నోజిగూడ రాష్ట్రీయ విద్యాకేంద్రంలో విశ్వహిందు పరిషత్ తెలంగాణ దుర్గావాహిని ఆధ్వర్యంలో ప్రాంత శౌర్య ప్రశిక్షణ వర్గను మే 27 నుంచి జూన్ 3 వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో దుర్గా వాహిని శౌర్య ప్రశిక్షణ యాత్రను శివారెడ్డిగూడ హనుమాన్ దేవాలయం నుంచి బస్టాండ్, బొడ్రాయి మీదుగా అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు. వర్గలో సేవా, సురక్ష, సంస్కార్ అనే మూడు అంశాలపై శిక్షణను ఇచ్చారు. మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, హనుమాన్, లక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి, రామతీర్థ, నాగేష్, శ్యామ్, దుర్గావాహిని తెలంగాణ ప్రాంత సంయోజక సక్కుబాయి, బజరంగ్‌దళ్ తెలంగాణ కన్వీనర్ శివరాములు, విశ్వహిందూ పరిషత్ ఉప్పల్ జిల్లా అధ్యక్షుడు రామేష్‌నాయుడు, కృష్ణవేణి, అరవింద్, ప్రభాకర్, శ్రీనివాస్, అరుణశ్రీ, సుజాత పాల్గొన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు


మునీరాబాద్ రెవెన్యూ సదస్సులో ఇన్‌చార్జ్ తహసీల్దార్ సునీల్‌కుమార్

మేడ్చల్‌రూరల్: ఉమ్మడి మేడ్చల్ మండలంలోని మునీరాబాద్, కోనాయిపల్లి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ అధికారులు భూ భారతి చట్టంపై రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మునీరాబాద్ గ్రామ వార్డు కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో మేడ్చల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ సునీల్‌కుమార్ రైతులు, గ్రామస్తులకు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. గ్రామస్తుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. భూ సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కోనాయిపల్లి గ్రామంలో ఆర్ఐ, అధికారులు భూ భారతిపై అవగాహన కల్పించారు. కాంగ్రెస్ నేతలు రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచులు, నాయకులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలకు వరం.. ఇందిరమ్మ ఇళ్లు


పోచారం మున్సిపాలిటీలో ఇందిరమ్మ పట్టాలు అందజేస్తున్న కమిషనర్ వీరారెడ్డి

పోచారం: కాంగ్రెస్ ప్రభుత్వం అందజేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరమని ఘట్‌కేసర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కె.వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం పోచారం మున్సిపాలిటీలో కమిషనర్ వీరారెడ్డితో పాటు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి పేదల అభ్యున్నతికి కోసం పనిచేస్తున్నారని చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ నేతలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మెట్టు నర్సింహారెడ్డి, ఎర్ర రాజు, అంజన్‌గౌడ్, మోటుపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం



కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ నాగమణి ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చే సూచనలను ఆమె లబ్ధిదారులకు వివరించారు. మేనేజర్ వెంకటేశం, జూనియర్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

45 రోజుల్లోగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలి

సాక్షితో మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి



మేడ్చల్: మున్సిపాలిటీలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు 45 రోజుల్లో ప్రారంభించకపోతే ఆ మంజూరీలు రద్దవుతాయని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో సాక్షితో మాట్లాడుతూ.. మేడ్చల్ మున్సిపల్ పరిధిలో 220 మంది అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. అందరికి పట్టాలు అందజేశామని, ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు మంజూరైన తేదీ నుంచి 45 రోజుల్లోగా ఖచ్చితంగా ఇంటి నిర్మాణం ప్రారంభించాలని సూచించారు.

అర్హత ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలి..

అర్హత ఉండి ఏదైనా కారణాలతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాని వారు ఉంటే తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అన్ని అర్హతలు ఉండి 60 గజాల ఇంటిస్థలం ఉన్న వారు గతంలో దరఖాస్తు చేసుకున్నా.. లేకపోయినా మరోసారి దరఖాస్తు చేసుకుంటే వారి దరఖాస్తులను పరిశీలించి మంజూరు చేస్తామని స్పష్టం చేశారు.

అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి..

మేడ్చల్ మున్సిపల్ అభివృద్ధి చెందాలంటే ప్రజల భాగస్వామ్యం తప్పకుండా ఉండాలని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజల కోసం చేపట్టే ప్రతిపనిలో భాగస్వామ్యులు కావాలని కోరారు. ప్రధానంగా తడి,పొడి చెత్తపై పూర్తి అవగాహనతో వేర్వేరుగా చెత్తవేయాలని సూచించారు. వర్షాకాలంలో రోగాల భారిన పడకుండా పారిశుద్ధ్య నిర్వహణపై శ్రద్ధ చూపాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు.

అంతర్జాతీయ స్థాయిలో 'రెండో డాన్ బ్లాక్‌బెల్ట్'

కీసర: గచ్చిబౌలిలోని జపాన్ కరాటే అసోసియేషన్ (జేకేఏ) ప్రధాన జోడోలో ఇటీవల బ్లాక్ బెల్ట్ డాన్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 26 రాష్ట్రాల నుంచి జేకేఏ మాస్టర్స్ హాజరయ్యారు. కీసర మండలానికి చెందిన ఠాకూర్ భగవాన్‌సింగ్ ఈ పరీక్షల్లో అత్యుత్తమ నైపుణ్యం, శారీరక, మానసిక స్థైర్యాన్ని ప్రదర్శించి అంతర్జాతీయస్థాయి 2వ డాన్ బ్లాక్ బెల్ట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా జేకేఏ ఇండియా ప్రధాన శిక్షకులు శిహాన్ ఆనంద్ రత్న, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి శిక్షకులు శిహాన్ రాపోలు సుదర్శన్ చేతుల మీదుగా ఠాకూర్ భగవాన్‌సింగ్‌కు బెల్ట్ డిప్లొమా ప్రదానం చేశారు.

రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు

మేడ్చల్: మేడ్చల్-కిష్టాపూర్ రోడ్డు గుంతలమయమై అధ్వాన్నంగా మారడంతో మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు స్థానికులు, కాంగ్రెస్ నేతల సాయంతో తగిన మరమ్మతులు చేశారు. టిప్పర్ల ద్వారా మట్టిని తెప్పించి జేసీబీలో సాయంతో పోలీసులు, నాయకులు శ్రమదానం చేసి గుంతలను పూడ్చివేశారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్ కాంగ్రెస్ నేతలు సుధాకర్, స్వామి, రమేష్‌బాబు, బాలయ్య పాల్గొన్నారు.

తడి,పొడి చెత్తపై అవగాహన


శామీర్‌పేట్ : తడి, పొడిచెత్తను ఇంటి వద్దే వేరుచేసి స్వచ్ఛఆటోలకు అందజేయాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ అన్నారు . మంగళవారం 100 రోజుల కార్యక్రమంలో భాగంగా తూంకుంట పురపాలక సంఘం పరిధిలోని 7వ వార్డులోని ద్వారకాపురికాలనీ, సాయినగర్ కాలనీలో సిబ్బందితో కలిసి ఆయన పర్యటించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తడి,పొడి చెత్తను ఇంటి వద్దే వేరుచేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు.

ఘట్‌కేసర్ నూతన సబ్ రిజిస్ట్రార్‌గా నవీన్



ఘట్‌కేసర్ : ఘట్‌కేసర్ నూతన సబ్‌రిజిస్ట్రార్‌గా నవీన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్ ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించారు. నగరంలోని రెడ్‌హిల్స్ సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించిన నవీన్ ఘట్‌కేసర్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ అనిల్‌కుమార్, కార్యాలయం సిబ్బంది ఆయనకు ఘనస్వాగతం పలికారు.

మహిళ అదృశ్యం


ఆర్తి

అల్వాల్: మహిళ అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీనగర్‌లో నివసించే గాయత్రి చౌహాన్ ముగ్గురు కుమార్తెలతో కలిసి ఉంటున్నారు. పెద్ద కుమార్తె ఆర్తి (27) ఈనెల 2న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆచూకీ కోసం తెలిసిన చోట్ల వెతికినా లభించకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.